

కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పెద్దమ్మ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారందరికీ ఆమె పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ , రేవంత్ రెడ్డి అధికారంలో రావడానికి ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. – కందుకూరు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 14 ఏప్రిల్ 2025 | HYDERABAD




బైశాఖీ ఉత్సవాలు ఆదివారం నగరంలో వేడుకగా జరిగాయి. ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో విశాల్ దివస్, నగర్ కీర్తన్ నిర్వహించారు.

# రేవంత్ పాలనలో › హైదరాబాద్ ఆగమైంది

## ఎక్కడి సమస్యలు అక్కడే... తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. బీజేపీ.. కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందే
- తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న కడుపు నొప్పి..ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటుందా?
- రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- సన్నాహక సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

### కేటీఆర్ సమక్షంలో చేరికలు..

కేటీఆర్ సమక్షంలో జరిగిన సన్నాహక సభలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు వేసి కేటీఆర్ బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత కిశోర్, సునీతా రాముయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సన్నాహక సభకు భారీగా తరలివచ్చిన శ్రేణులు

సన్నాహాక సభకు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు జై కేటీఆర్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌తో ఫొటోలు దిగేందుకు పోటీలు పడ్డారు.

మేడ్చల్, ఏప్రిల్13(నమస్తే తెలంగాణ): భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా.. హైదరాబాద్‌లో ఒక్క అభివృద్ధి పనిని ప్రారంభించలేదన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న కడుపు నొప్పి..ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటుందా అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో 16 సీట్లు గెలిపించి హైదరాబాద్ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకున్నారని చెప్పారు. మంచి నాయకుడు ఉంటే మంచి జరుగుతుందని గుర్తించి.. భవిష్యత్‌లో మోసపోవద్దన్నారు.

### నగరంలో ఎక్కడి సమస్యలు అక్కడే

రేవంత్ పాలనలో హైదరాబాద్ అంతా ఆగమైపోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మోరీల్లో పూడికలు తీయకపోతే మోరీల్లో కూర్చుంటున్నారని, శ్మశానవాటికను డంపింగ్ యార్డ్ చేస్తుంటే డంపింగ్ యార్డ్‌లో కూర్చుంటూ.. ప్రభుత్వాన్ని ప్రజల సమస్యలు పరిష్కరించాలని నిలదీస్తున్నారన్నారు. హైదరాబాద్ అంతటా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజలు ఇది గమనించాలన్నారు.

### మహిళలకు ధన్యవాదాలు..

సన్నాహక సభకు ఎర్రటి ఎండలో హాజరైన మహిళలకు ధన్యవాదాలని కేటీఆర్ అన్నారు. భారీ సంఖ్యలో తరలి వచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు వచ్చిన వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సన్నాహక భకు భారీ సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యావాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# బల్దియాలో గలీజు దందాలు ..!

## గడువు ముగిసినా.. కొనసాగుతున్న వ్యాపారాలు

- మరికొన్ని చోట్ల సబ్ లీజుల పేరిట దోపిడీ
- రూ. లక్షల్లో వసూలు.. బల్దియాకు వేలల్లో చెల్లింపులు
- రంగంలోకి కమిషనర్..
- నోటీసులు జారీ చేస్తున్న ఎస్టేట్ విభాగం





సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఆస్తులను అక్రమ లీజుదారులు దర్జాగా అనుభవిస్తున్నారు. గజం స్థలానికి రూ.1 అద్దె చెల్లిస్తున్న లీజు ఒప్పందాలు నేటికీ యధావిధిగా కొనసాగుతున్నాయి. ఆజాద్(మోతి) మార్కెట్ లీజుల గడువు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. తాజాగా లీజుదారులు సబ్ లీజులకు ఇచ్చి మరీ దందాలకు తెరలేపారు. రూ.లక్షల్లో వసూలు చేసుకుంటూ జీహెచ్ఎంసీకి కేవలం రూ. వేలల్లో మాత్రమే డబ్బులు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 1750 మందికి నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఆరు జోన్లలో మొత్తం 22 మార్కెట్లుండగా, వాటిలో 2152 స్టాళ్లు ఉన్నాయి. వెజిటేబుల్ మార్కెట్లు 5, నాన్ వెజ్ మార్కెట్లు 7, రెండు కలిపి 10 కలిపి ఉన్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్‌లు 19, యూనిట్లు 715 వరకు, మోడల్ మార్కెట్లు 37 ఉండగా 589 షాపులు ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల నుంచి అద్దెలు చెల్లించని వ్యాపారులు ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

### ఆన్‌లైన్‌లోకి ప్రతి ఆస్తి

గ్రేటర్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి దాని ప్రకారంగా కంప్యూటరైజ్ చేశారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయినా.. ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేసి వాటి వివరాలను అందులో పొందుపర్చారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి నివేదిక సిద్ధం చేశారు. లీజు పూర్తయినా.. ఇంకా కొనసాగుతున్న దుకాణాల వివరాలను పూర్తి నివేదిక అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అద్దె చెల్లింపు కూడా ఆన్ లైన్ ద్వారా చెల్లించడంతో పాటు ఒక్కొక్క ఆస్తికి ఒక ఐడీ కేటాయిస్తున్నారు.

# వీడని చిక్కుముడి

నత్తనడకన ఓల్డ్ సిటీ మెట్రో కారిడార్ భూసేకరణ ప్రక్రియ

సిటీబ్యూరో, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఓల్డ్ సిటీ మెట్రో ప్రాజెక్టు భూముల పంచాయితీ సంక్లిష్టంగా మారుతున్నది. 7.5 కిలోమీటర్ల పొడువైన ప్రాజెక్టు కోసం 1100 ఆస్తులు సేకరించాల్సి ఉన్నా... ఇప్పటివరకు 205 ఆస్తులు మాత్రమే మెట్రోకు అందజేయగా... మిగిలిన ఆస్తుల సేకరణలో ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఓ వైపు చారిత్రక, మతపరమైన కట్టడాల విషయంలో కోర్టు చిక్కులు రాగా, మరోవైపు ప్రైవేటు వ్యక్తులు కూడా ఇదే తరహాలో పరిహారం కోసం ప్రతిఘటించడంతో భూసేకరణ అనుకున్నంత సులభంగా పూర్తయ్యేలా కనిపించడం లేదు. 7.5కిలోమీటర్ల పొడవైన మార్గంలో మతపరమైన, చారిత్రక కట్టడాలే ఎక్కువగా ఉన్నాయి. వీటి విషయంలో మెట్రో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని, ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పనులు చేపడుతామన్నంటున్న క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును విశ్వసించడం లేదు. అదేవిధంగా గజానికి రూ. 80వేలకు పైగా పరిహారం చెల్లిస్తామని చెబుతున్నా... మార్కెట్ విలువ ఆధారంగా మరింత అధిక పరిహారం కోరుతూ కోర్టును ఆశ్రయిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కొంటూనే... ప్రభావిత ఆస్తుల యాజమానులతో చర్చలు జరుపుతున్నా... ఆస్తుల సేకరణ గడిచిన 4 నెలలుగా సాగుతూనే ఉంది.



# గ్రేటర్ బీఆర్ఎస్‌లో రజతోత్సవ సంబురం

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ బీఆర్ఎస్‌లో రజతోత్సవ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభకు శ్రేణులు సమాయాత్తమవుతున్నారు. ఈ వేడుకను ప్రతి కార్యకర్త ఇంట్లో పండుగ వాతావరణంలో జరుపుకునేలా భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8న తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో రజతోత్సవ సభ విజయవంతం చేసేలా దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3వేల మంది సభకు వెళ్లేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గొప్ప పరిపాలనాదక్షుడని సన్నాహక సమావేశంలో నేతలు చెబుతున్నారు. ఉద్యమసారథియే తెలంగాణ మొదటి సీఎంగా ఉండటం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా జరిగిందని కొనియాడారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ వ్యవస్థాపక పండుగ తమ ఇంట్లో పండుగగా ప్రతి ఒక్క కార్యకర్త భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. గ్రేటర్‌లో కార్యకర్తలందరితో సమావేశం ఏర్పాటు చేసి వరంగల్‌కు బయలుదేరడంపై సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నేతలు వివరిస్తున్నారు. సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొంటుండడంతో శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

# మిద్దెతోటలు సాగు చేద్దాం

- హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవాస్తవ
- నాంపల్లి వేదికగా రైతు మేళా
- 200కు పైగా స్టాళ్ల ఏర్పాటు
- నేడే చివరిరోజు



స్టాల్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఔత్సాహికులు

సిటీబ్యూరో, ఏప్రిల్13,(నమస్తే తెలంగాణ)/రవీంద్రభారతి: పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ మిద్దె తోటల సాగుబడి ప్రాముఖ్యతను తెలుసుకోవాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవాస్తవ అన్నారు. అగ్రి–హార్ట్ సొసైటీ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న తెలంగాణ రైతు మేళా–2025 నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నారు. ఆర్గానిక్ కూరగాయలు, నాటు విత్తనాలు, మొక్కలు, కుండలు మొదలైనవి 200వరకు స్టాళ్లను ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి రైతులు తాము పండించిన, సేకరించిన కూరగాయలు, మిగతా వస్తువులతో ఈ మేళాకు హాజరై స్టాళ్లు పెట్టారు. మూడో రోజు ఆదివారం భారీగా ప్రజలు స్టాళ్లను సందర్శించి, వస్తువులు కొనుగోలు చేశారు.

### ఉచితంగా 600 మొక్కలు పంపిణీ

నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ రైతు మేళాలో పలు స్టాళ్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ వాళ్లు ఇప్పటివరకు 600వరకు వివిధ రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. కాగా, సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ స్టాల్‌ను హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవాస్తవ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవాస్తవ మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు మిద్దె తోటల సాగుబడి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ వ్యవస్థాపకులు హర్కర్ శ్రీనివాస్ ఎన్‌సీఎఫ్ శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్, హెచ్ఎండీఏ ఏడీ విజయబాబు, సినీ నటుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

# గాలి వీచినా.. చినుకుపడినా..

### నగరంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

సిటీబ్యూరో, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): చిన్నచినుకు పడితే కరెంటు పోతున్నది. గాలి గట్టిగా వీచినా ఇండ్లలో చీకటి రాజ్యమేలుతున్నది. ఇది గ్రేటర్ హైదరాబాద్ సిటిలో, శివారు ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితి. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై ఎస్పీడీసీఎల్ అధికారులు దృష్టి పెట్టారు. అయితే పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాకు కావాల్సిన ఏర్పాట్లు చేయకపోవడంతో ఫీడర్లు ట్రిప్ అవుతున్నాయని విద్యుత్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. చిన్నపాటి వర్షం, ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. చెట్లు కూలిపోవడం, తీగలపై పడడం వంటి మేజర్ సమస్యలు ఉన్నచోట ఇబ్బంది అయినప్పటికీ.. చాలాచోట్ల సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో సరిదిద్దిన ఫీడర్లు, డీటీఆర్‌లు ఈ వర్షాలకు దెబ్బతిన్నాయి. కేవలం పదిహేనురోజుల వ్యవధిలో కురిసిన వర్షాలకు నగరంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తమైంది. అధికారులు రంగంలోకి దిగినప్పటికీ గంటల తరబడి, కొన్ని ప్రాంతాల్లోనైతే ఒకరోజు మొత్తం సరఫరానే లేకుండా పోయింది.

# సుందరీకరణ పేరుతో హైడ్రా మా

- మరోసారి కూకట్‌పల్లి నల్లచెరువుపై హైడ్రా కన్ను
- సుందరీకరణ పేరుతో హడావుడిగా పనులు
- నష్టపరిహారం ఇచ్చిన తరువాతే పనులు చేపట్టాలంటున్న బాధితులు



బాధిత రైతులతో మాట్లాడతున్న హైడ్రా కమిషనర్ ( ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 13: కూకట్‌పల్లి నల్లచెరువు సుందరీకరణ పేరుతో హడావుడి చేస్తున్న హైడ్రా అధికారుల తీరుతో ఆ ప్రాంతంలో వారసత్వ హక్కులు కలిగిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కూకట్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 27 నుంచి 80 వరకు సుమారు 20 ఎకరాలలో నల్లచెరువు విస్తీర్ణం ఉంది. దీనిలో కేవలం 7.38 ఎకరాలు మాత్రమే చెరువుకు సంబంధించినది కాగా మిగిలిన భూమి మొత్తం యాజమాన్య హక్కులు కలిగిన పట్టా భూములే. ఈ భూముల్లో అనాదిగా రైతులు వ్యవసాయం చేస్తూ జీవనాన్ని సాగించారు. పట్టణీకరణలో భాగంగా ఈ చెరువు పరిసరాల్లో భవన నిర్మాణాలు వెలిశాయి. కాగా ఈ చెరువుకు సంబంధించి ఎఫ్‌టీఎల్ పరిధి 2010 ఏడాదిలో 19 ఎకరాలుగా తేల్చగా... ప్రస్తుతం 27 ఎకరాలుగా రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారులు చెబుతున్నారు.

### అధికారంలోకి వచ్చిన వెంటనే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 లో ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చూపు కూకట్‌పల్లిలోని నల్లచెరువుపై పడింది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని హడావిడిగా పలు నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో బాధిత రైతులు.. కోర్టు ఆదేశాలను, కోర్టు ధిక్కరణ పిటిషన్ కొనసాగుతున్న విషయాన్ని హైడ్రాధికారులకు సమర్పించడంతో కూల్చివేతల పర్వాన్ని హైడ్రా తాత్కాలికంగా నిలిపివేసింది.

### సుందరీకరణ పేరుతో....

అయితే నల్ల చెరువు సుందరీకరణ కోసం ప్రభుత్వం రూ.9కోట్లు కేటాయించగా అధికారులు సుందరీకరణ పనులను ఇప్పటికే ప్రారంభించారు. చెరువులోని నీటిని పూర్తిగా తొలగించి పూడికతీత పనులను చేపట్టారు. ఈ క్రమంలో బాధిత రైతులు మరోసారి పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. నల్ల చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులు శాస్త్రీయబద్ధంగా లేదని.. మరోసారి సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించాలని హైడ్రా అధికారులను వేడుకున్నారు. అలాగే చెరువు సుందరీకరణ పనులు చేపట్టే ముందు బాధిత రైతులకు చట్టప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. హైకోర్టు సూచనలకు విరుద్ధంగా బాధితులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా హడావిడిగా పనులు చేపట్టడంపై బాధిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రీయబద్ధమైన సర్వే లేకుండా చెరువు సుందరీకరణకు తమ పట్టా భూములను ఎలా ఇస్తామని ప్రశ్నించడంతో హైడ్రా అధికారులు వెనుదిరిగారు.

### హామీ ఇచ్చినప్పటికీ..

గతంలో హైడ్రా కమిషనర్‌ను కలిస్తే... బాధిత రైతులకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేస్తామని చెప్పారని దీనికి తాము కూడా అంగీకరించినట్లు తెలిపారు.అయితే మరోసారి గత శుక్రవారం అధికారులు చెరువును పరిశీలించి వెళ్లడంతో ఎప్పుడు ఏం చేస్తారో అనే భయం తమను వెంటాడుతోందని బాధిత రైతులు చంద్రశేఖర రావు హనుమంతరావు, సుధాకర్ రావు, సీహెచ్ నర్సింహరావు, ఎం.మధుసూదన్ రావు, ఎం నర్సింహ రావు, చౌదరి నర్సింగరావు, సీహెచ్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాధిత రైతులు

### పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి



నల్ల చెరువు సుందరీకరణ కోసం స్పష్టమైన ప్రణాళిక లేకుండా హైడ్రా అధికారులు పనులు ఎలా చేపడతారు? చెరువు సుందరీకరణపై స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు కనీస సమాచారం లేదు. ఇదే విషయమై ఎమ్మెల్యే కృష్ణారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో మొదలుపెట్టిన బతుకమ్మ కొలను పనులను మధ్యలో ఆపేశారు. నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే సుందరీకరణ పనులు చేపట్టాలి.

– జూపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్, కూకట్‌పల్లి